హెచ్ఐవి నిర్మూలనే ధ్యేయం

ప్రజాశక్తి - కడప అర్బన్

హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలనే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఖాదరవల్లి పేర్కొన్నారు. గురువారం గర్భిణుల వైరల్ లోడ్ మార్గదర్శకాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి, బిడ్డ సంరక్షణలో భాగంగా హెచ్ఐవి/ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో ఎయిడ్స్‌తో ఉన్న గర్భిణీలకు సరికొత్త వైరల్ లోడ్ పరీక్ష మార్గదర్శకాల పోస్టర్ ఆవిష్కరించామని తెలిపారు. ఏ తల్లి ప్రసవిస్తూ మరణించకూడదు, ఏ బిడ్డ జీవిస్తూ మరణించకూడదని చెప్పారు. హెచ్ఐవి, ఎయిడ్స్ సోకిన వారు కృంగిపోకుండా సరైన మందులు వాడి జీవన ప్రమాణాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, సాదిక్, అప్రోజ్, వెంకటేశ్వర్లు, సావిత్రి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

స్పందించకపోతే పోరాటాలు తప్పవు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పం దించకపోతే పోరాటాలు తప్పవని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్, జిల్లా సెక్రెటరీ జనరల్ షేక్ మహ్మద్ ఇర్షాద్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు దశల వారీ పోరాట కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో జెసికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదన విజయ కుమార్, షేక్. మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యా వ్యవస్థను చిన్నభిన్నం చేస్తున్న జీవో ఎంఎస్ నెంబర్ 117 ను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టిం చుకున్న పాపాన పోలేదన్నారు. గత ఎన్నికలకు ముందు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాట ఇచ్చి, హామీని నెరవేర్చకపోగా సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం చేప డుతున్న బోధనేతర కార్యక్రమాల వల్ల విద్యా బోధన కుంటుపడు తుందని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యా ర్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని తెలిపారు. పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉపా ధ్యాయుల పట్ల అనుసరిస్తున్న తీరు బాధాకరమని, ఉపాధ్యాయుల పట్ల ఆయన వైఖరిని ప్రభుత్వం నియం త్రించాలన్నారు. 11వ పిఆర్‌సి తోపాటు అన్ని రకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని చేయా లన్నారు. చట్ట బద్ధమైన 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియ మించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోతే సమస్యల పరిష్కా రానికి ఉద్యమాలే శరణ్యమని వారు పేర్కొన్నారు. డిమాండ్ల సాధనకు ఉపాధ్యాయులు అందరూ ఐక్యమై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్ర మంలో యు టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇలియాస్ బాష, రూప రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు వి.వి. వీరాంజుల రెడ్డి, టి. వెంకటేశ్వరరెడ్డి, ప్రధానో పాధ్యా యుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకట సుబ్బారెడ్డి, ఏపీటీఎం ఎఫ్(1938) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో నాయకులు

విద్యా కానుక పంపిణీకి సిద్ధమవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం రోజే 'జగనన్న విద్యా కనుక' కిట్లను విద్యార్థులకు అంది ంచేందుకు అన్ని చర్యలను చేప ట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశి ంచారు. గురువారం అమరావతి నుండి జగనన్నకు చెబుదాం, హెల్త్, స్కూల్ ఎడ్యుకేషన్, ప్రభుత్వ పథకాల అమలు, స్పందన గ్రీవెన్స్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి సంబ ంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేంకు ప్రభుత్వం అమ లు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజల కు సంతృప్తి స్థాయిలో అం దాలని, ప్రజల నుంచే అందే స్పందన అర్జీలకు వేగవంతంగా, సంతృప్తి కారంగా పరిష్కారం చూ పాలని ఆదేశించారు. జిల్లా స్థాయి లో ఈ నెల 17న జగనన్న ఆణి ము త్యాలు కార్యక్రమం ద్వారా 10వ తర గతి, ఇంటర్ సెకెండ్ ఇయ ర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సహిస్తూ నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రా లు అందించే కార్య కమాన్ని విజ యవంతం చేయాలన్నారు. ఈ నెల 28న చేపట్టే జగ నన్న అమ్మ ఒడి పథకం లబ్ధి దారుల జాబితాను ఈ నెల 15 నాటికి పూర్తిచేసి ఏవైనా అభ్యం తరాలను స్వీక రించి పరిశీలి ంచాలన్నారు. వైద్య విధాన పరిష త్‌ను విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేప థ్యంలో పిహె చ్‌సి స్థాయిలో వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు మరింత పటిష్టంగా గ్రామాల్లో సేవలు అందించాలన్నారు.

అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

పులివెందుల ప్రజలూ జగన్ బాధితులే

- పులివెందులకు ఏం చేశారో చెప్పాలి
- పాలకొండను మింగేసిన వైసిపి అనకొండలు
- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-సిద్ధవటం

90 వేల మెజార్టీతో గెలిపించిన పులివెందుల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ప్రశ్నించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 120 రోజుకు చేరుకుంది. గురువారం కడప శివారులోని ఓ ప్రయివేటు కల్యాణ మండపం విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలంలోని టక్కోలిలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి మాచుపల్లె, చంటిగారిపల్లె విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో న్యాయవాదులు, రైతులు, స్థానికులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ జయంతి, వర్ధంతికి రావడం తప్ప పులివెందులకు జగన్ చేసింది ఏమీలేదన్నారు. ఒక్క పరిశ్రమ తీసుకొచ్చాడా? రోడ్లు వేసాడా? కోట్ల రూపాయలు మంజూరు చేశానంటున్నాడు. ఒక్క రూపాయి విడుదల చేశాడా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో విపరీతంగా పన్నులు పెంచి ప్రజల్ని పీడిస్తున్నాడని విమర్శించారు. పులివెందుల ప్రజలు కూడా జగన్ బాధితులేనని తెలిపారు. పులివెందులలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు ఏమి జరగడం లేదని చెప్పారు. నాడు-నేడు పేరుతో హడావిడి తప్ప పులివెందుల స్కూళ్లలో కనీసం మౌలిక వసతులు లేవన్నారు. రూ.వందల కోట్లతో రోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశాడన్నారు. జగన్. ఒక్క రోడ్డు కూడా పూర్తి చేయలేదన్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధ్వర్యంలో వేయాల్సిన రోడ్లు పూర్తి చేయలేదని చెప్పారు. కనీసం అదనంగా ఒక్క ఎకరాకు సాగునీరు జగన్ అందించలేదని పేర్కొన్నారు. పులివెందులలో టిడిపి గెలవకపోయినా ఎప్పుడూ చిన్న చూపు చూడలేదన్నారు. అన్ని నియోజకవర్గాల లాగే పులివెందులను అభివద్ధి చేశామని తెలిపారు. సాగు నీరు, సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు అమలు చేశామన్నారు. రాజకీయ అవకాశాలు కూడా ఎక్కువ కల్పించామని, ఎన్నో పదవులు ఇచ్చామని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడినప్పుడే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తారని తెలిపారు. కేసులకు భయపడి ఇంట్లో పడుకుంటాం అంటే ప్రజలు హర్షించరన్నారు. పోరాడిన వారికే ప్రజల మద్దతు ఉంటుందన్నారు. మిషన్ రాయలసీమలో భాగంగా పులివెందులకు కూడా పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. జగన్ మైక్రో ఇరిగేషన్ అంటూ హడావిడి చేశారని, ఒక్క అడుగు ముందుకు వేయలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జగన్ ఒక ఉగ్రవాదని, అన్ని వ్యవస్థల్ని నాశనం చేసాడన్నారు. ప్రజా వేదిక కూల్చి పరిపాలన ప్రారంభించాడని తెలిపారు. జగన్ పాలనలో న్యాయవాదులు కూడా బాధితులేనని పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులు చేయించాడన్నారు. న్యాయవాదులకు అనేక హామీలు ఇచ్చిన జగన్ ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే జగన్ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాడన్నారు. మూడు రాజధానుల పేరుతో మోసం తప్ప ఒక్క ఇటుక పెట్టలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలులో హై కోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. నేషనల్ లా కాలేజ్ కర్నూలులో ఏర్పాటు చేయాలని టిడిపి అనుకుంటే దానిని జగన్ వేరే ప్రాంతానికి తరలించాడన్నారు. కోర్టుల్లో ఎంత దుర్భరమైన పరిస్థితులు ఉన్నాయో నేను స్వయంగా చూశానని,. కనీసం కూర్చోడానికి కుర్చీలు, బాత్ రూంలు కూడా లేవని పేర్కొన్నారు. వైసిపి అక్రమార్కులు కంటిపడితే చాలు కొండలు, గుట్టలు మాయమై పోతున్నాయన్నారు. పాదయాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, నాయకులు అమీర్‌బాబు, బత్యాల చెంగల్రాయుడు, గంటానరహరి పాల్గొన్నారు.

పులివెందుల నేతల సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

కేంద్ర గ్రంథాలయంలో విసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయాన్ని విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ రెడ్డితో కలిసి కేంద్ర గ్రంథాలయానికి వచ్చారు. గ్రంథ పాలకులు, సిబ్బంది సమయపాలనను పరిశీలించారు. సిబ్బంది ఒకరు నిర్ణీత సమయానికి రాకపోవడానికి గమనించి కారణాలు ఆరా తీశారు. విద్యార్థులు, అధ్యాపకులు ఎంత మేరకు గ్రంథాలయాన్ని ఉపయోగించుకుంటున్నారనే విషయాన్ని గమనించారు. డిజిటల్ లైబ్రరీలో సాఫ్ట్‌వేర్ పనిచేయడాన్ని చూశారు. గ్రంథాలయ స్టాక్ రిజిస్టర్‌ను ప్రత్యక్షంగా చూశాక సిబ్బందితోపాటు హెడ్ తో సంతకం చేయించాలని గ్రేడ్ వన్ లైబ్రరీ అసిస్టెంట్ బి. ప్రసాద్ రావు, ఆర్. విజయ్ కుమార్ ఆదేశాలిచ్చారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి పుస్తకం లైబ్రరీలో ఉండేలా చూస్తామన్నారు. సమయపాలన కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. **విద్యార్థులు ఉంటే మనం..** విద్యార్థులు ఉంటేనే మనం ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకుని ఎవరి బాధ్యతలను వారు కర్తవ్య దీక్షతో నిర్వహించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి విశ్వవిద్యాలయంలోని అన్ని వసతి గృహాల సంక్షేమ అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశమయ్యారు. ఎవరెవరు ఏ ఏ విధులు నిర్వర్తిస్తున్నారనే పరిచయ కార్యక్రమం పూర్తయ్యాక తన ఆలోచనా విధానాలను సిబ్బందికి వివరించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. సిబ్బందికి విద్యాలయం తరపున రావాల్సిన ప్రయోజనాలను అందేలా చూస్తానన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సంక్షేమ అధికారులు హాస్టళ్లను నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రిన్సిపల్ అసిస్టెంట్ డాక్టర్ రెడ్డయ్య, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న విసి

సభ్యత్వ నమోదు పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య అధ్యక్షతన సభ్యత్వ నమోదు పోస్టర్లను గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం చెప్పలి పుల్లయ్య మాట్లాడుతూ కార్మిక విభాగం రాష్ట్ర ఇన్‌ఛార్జి చార్జ్ డాక్టర్ మమతా మాధవ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్మిక శాఖను బలోపేతం చేయడం, తద్వారా పార్టీకి మరింత బలాన్ని చేకూర్చడం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న 10 సమస్యలకు పరిష్కారం చేయాలన్న డిమాండ్లను కూడా ప్రచురించామని తెలిపారు. ఈనెల 10 నుంచి జులై 10 కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బాబు, నగర మహిళ అధ్యక్షురాలు లావణ్య, కార్మిక విభాగం జిల్లా డ్రైవర్స్ ప్రెసిడెంట్ విక్కీ, కమలాపురం అధ్యక్షులు అశోక్ రావు, ప్రొద్దుటూరు అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యుత్ ఛార్జీల అదనపు భారం తగదు

ప్రజాశక్తి - కడప

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మండలి ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోని విద్యుత్ సరఫరా సంస్థలు ఇటీవల అమాంతంగా రాష్ట్ర ప్రజలపై విద్యుత్ అదనపు ఛార్జీలను వివిధ రకాల పేర్లతో పెంచేశాయని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. కడప నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజలను విద్యుత్‌ఛార్జీలపై అదనపు రుసుముల పెంపు పేరుతో నిరంతరంగా దోపిడీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సేవ, సంక్షేమం వంటి వాటికీ తిలోదకాలు ఇచ్చి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల తరహాలో వ్యాపారం చేస్తున్న ధోరణి విద్యుత్ ఛార్జీల పెంపుతో అర్థమవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏకపక్షంగా ఇటీవల స్లాబుల ప్రకారంగా సగటు యూనిట్ ధరను అమాంతంగా పెంచిందని విమర్శించారు. పథకం ప్రకారం సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు ఇతర అణగారిన వర్గాలకు విద్యుత్ సౌకర్యం కూడా లేకుండా చేసే విధంగా కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వ్యవస్థను వాణిజ్య సంస్థలుగా అమలు చేస్తున్న విధానానికి పూర్తిగా స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహమ్మద్ అలీఖాన్

దూదేకులకు సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

40 ఏళ్ల నుంచి దూదేకులు టిడిపికి ఓటు బ్యాంకుగా ఉన్నారని, రాజకీయంగా వారికి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించి చట్టసభల్లోకి తీసుకువెళ్లాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ కోరారు. గురువారం యువ గళంలో భాగంగా నగర శివారులో ఉన్న నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మన్నూర్ అక్బర్ మాట్లాడుతూ దూదేకులు ఐఎఎస్, ఐపిఎస్ చదవాలనే వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. వ్యాపారపరంగా లక్ష రూపాయలు సబ్సిడీతో సంబంధం లేకుండా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2006 ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు జిల్లా పరిషత్, మండల పరిషత్, కార్పొరేషన్ లో కో-ఆప్షన్ మెంబర్స్‌గా కొనసాగించాలని, రాయలసీమలో దూదేకుల జనాభా ఎక్కువగా ఉన్నారని వారిని చురకైనా నాయకులుగా తయారు చేయాలని కోరారు. విదేశాల్లో దూదేకుల విద్యార్థులు డాక్టర్స్‌గా, ఇంజినీరింగ్‌గా విదేశీ విద్య ద్వారా కొనసాగించాలని పేర్కొన్నారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

లోకేష్‌తో మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

మాట్లాడుతున్న కేసన శంకరరావు

బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి - కడప

అధి. కారంలోకి రావడానికి బిసిల మద్దతు కోరే రాజకీయ పార్టీలు ఏరు దాటాక తెప్ప తగ లేయడమనే చందంగా మారాయని ఆంధ్ర ప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. తిరుపతిలో ఆగస్టు 7న జరుగనున్న జాతీయ ఒబిసి మహాసభను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. గురువారం కడపకు వచ్చిన సందర్భంగా పాత రిమ్స్ ఆవరణలోని బిసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా నిర్వహించే జాతి జనగణనలో బిసి కులగణన చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు దాటినానంతరం ప్రధాని పదవిలో బిసి కూర్చోవడం తమకు మేలు జరుగుతుందని భావించామని, కానీ ఆయన బిసిలను ఇరకాటంలో పెట్టడం సరికాదన్నారు. అగ్రకులాలు బిసిలకు స్థానం కల్పించడానికి ఇష్టపడితే అదే బిసి వ్యక్తి అయిన ప్రధాని మోడీ తమకు ఏం చేయకపోవడం బాధాకరమన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు గుర్రం ద్వారకా శీను, రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకారావు, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, బీసీ ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు, బిసిసంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం

కడప అర్బన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నూతన భవన నిర్మాణ పనులను గురువారం విసి బానోతు ఆంజనేయప్రసాద్; రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రరెడ్డి ప్రారంభించారు. జులై 8న విశ్వవిద్యాన భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేయాలనే ఆలోచనలో అధికారులున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ పనులన్నీ సాఫీగా సాగితే సిఎం చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు, అటవీ అధికారుల నుంచి క్లియరెన్స్ వచ్చిందన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సూపరింటెండెంట్ యెద్దుల పవన్ కుమార్ రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

పసుపు కొనుగోలు విషయంలో నాణ్యత నిబంధన ప్రమాణాల విషయంలో ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రాష్ట్ర సలహాదారుడు ఇరగం రెడ్డి తిరుపాల్ రెడ్డి గురువారం కలెక్టర్ విజయరామరాజుని కలిసి వినతి పత్రం ద్వారా తెలియజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పసుపు కొనుగోలు విషయం లో రైతులు పడుతున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పథకాల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధా

ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకూ..

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు బద్వేల్ నియో జకవర్గ శాసన సభ్యులు డాక్టర్ సుధా పేర్కొన్నారు. గురు వారం మండ లంలోని రామేశ్వరం, బూరగమాని పల్లె, నాగలకుంట్ల గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాధరణ పొందుతున్నదని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏయే స్థాయిలో ఏయే వర్గాలకు చెందుతున్నాయో అనే అంశంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం నాడు నేడు కార్యక్రమం చేపట్టి విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని చెప్పారు. రామేశ్వరంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, కాలం చెల్లిన వైర్లను, వెంటనే తొలగించి మరమ్మతులు చేపట్టాలన్నారు. సిమెంట్ రోడ్లు లేని ప్రాంతంలో అంచనాలు వేసి నివేదిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సి బాష, ఎంపిటిసి రవికుమార్, సంచర్ల పంచాయతీ సర్పంచ్ చెరుకూరి రోశయ్య, కన్వీనర్ దస్తగిరి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రారంభించిన రక్తనిధి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఆస్పత్రిలో రక్తనిధి యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ ఏర్పాటు చేయడం కోసం ప్రయివేట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కృషి ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం అన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యో గులను పర్మినెంట్ చేయా లని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యా లయ ంలో జిల్లా ఉపాధ్యా క్షులు అధ్యక్షతన కాం ట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులైన అంగన్వాడీ హెల్పర్స్ విద్యుత్, ఆశా, విఆర్ఎ, ఆస్పత్రి, మున్సిపాల్టీలో పనిచేసే కార్మి కులందరినీ ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని అన్నారు. పెరిగిన నిత్యా వసరాలను బట్టి వేతనాలు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను ప్రయివేట్ స్వచ్ఛంధ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నాయని, ఇలాంటి దుర్మార్గ ఆలోచనలను తిప్పికొట్టేందుకు కార్మికులు ఉద్యమానికి సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవ ప్రసాద్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు విజయమ్మ, నాయ కులు జ్యోతిమ్మ, దస్తగిరిమ్మ ,రేణుక దేవి, సుందరయ్య, రవి పాల్గొన్నారు.

భూ కబ్జాల చరిత్ర 'పుత్తా' కుటుంబీకులదే

ప్రజాశక్తి - కడప

భూకబ్జాలకు పాల్పడి ప్రజలను బెదిరించే చరిత్ర పుత్తా కుటుంబీకులదేనని వైసిపి రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ ఆరోపించారు. గురువారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ కబ్జాల చరిత్ర, ప్రజలను బెదిరించి దాడులు చేసే సంస్కృతి, ఇసుక అక్రమ రవాణా ద్వారా కోట్లు గడించి జేబులోకి వేసుకున్న ఘనత వారిఆదేనని ఆరోపించారు. కమలాపురం టిడిపి నాయకులు పుత్తా చైతన్య రెడ్డికి ఏమాత్రం రాజకీయ అనుభవం, అవగాహన లేదన్నది ఆయన చేసిన నిరాధారమైన ఆరోపణలను బట్టి తెలుస్తుందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి, ఆయన తనయుడు చింతకొమ్మదిన్నె మండలం జడ్‌పిటిసి నరేన్ రామాంజుల రెడ్డి పై చేసిన ఆరోపణలలో ఏ మాత్రం నిజం లేదని, కేవలం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రిగ్గింగులకు పాల్పడి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ప్రజల భూములను లాక్కున్న చరిత్ర పుత్తా నరసింహారెడ్డి, పుత్తా చైతన్య రెడ్డి, పుత్త లక్ష్మీరెడ్డిలదే అన్నారు. ప్రజల్లో అభిమానం ఉంటే ఒక్కసారైనా ఎందుకు గెలవలేదని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు గుత్తి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చంద్రహాస్ రెడ్డి, 21వ డివిజన్ ఇన్‌ఛార్జి మోతుకూరు సుబ్బరాయుడు, 51 వ డివిజన్ ఇన్‌ఛార్జి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న నాగార్జునరెడ్డి

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి, ప్రభావతమ్మ దంపతులను పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు నాగార్జునరెడ్డి పూలమాల వేసి, శాలువ కప్పి సన్మానిం చారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తనను సలహా దారుడిగా ఎంపిక చేయడంలో ఎమ్మెల్యే సహకారం ఉందని నాగార్జునరెడ్డి కొని యాడారు. రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో సలహదారుడిగా నియ మించిందని, ఆ మేరకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, వేమారెడ్డి, పెద్దగురువలూరు సర్పంచు రాజేష్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, వివేకానంద పాఠశాల కరెస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శివారెడ్డి, గోవర్ధన్, జయసుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఒగా అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ముద్దనూరు అటవీ శాఖ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా అశోక్‌కుమార్ యాదవ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న దినేష్‌కుమార్‌రెడ్డి నంద్యాల జిల్లాకు వెళ్లారు.

దేవస్థానం కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

పనులు పరిశీలించిన ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ముద్దనూరు రోడ్డులో జరుగుతున్న పను లను తనిఖీ చేశారు. అనం తరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్‌టిసి బస్టాండ్ సమీ పంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాల యాన్ని పరిశీలించి, కమిటీ సభ్యులతో దేవాలయాల అభివృద్ధి కోసం చర్చించారు. కార్యక్ర మంలో మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న కావలి కృష్ణతేజ

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అంద జేశారు. గురువారం గండి మాజీ చైర్మన్ కావలి విజయ్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాయ లసీమ కాపునాడు యువ జన సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహు మతులను అంద జేశారు. అనంతరం కృష్ణ తేజ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామానికి పేరు ప్రఖ్యాతులు రావాలంటే అది విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. పాఠశాలకు 9,10 తరగతులకు అవకా శమిచ్చి, అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని స్థానికులు కోరారు. విషయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, చిన్నమ్మ, కావలి హరినాథ్, వెంకటేశ్వర్లు, మల్లయ్య, షేక్ అజీమ్, తక్కల్ల దర్బార్‌వల్లి, కావలి రామ్మోహన్, షేక్ చాను, చిక్కాల గుర్రప్ప, వార్డు మెంబర్లు చిలమకూరు రమాం జి, బాషా, వెల్ఫేర్ ఆఫీసర్ ఫరూఖ్, గ్రామ పోలీస్ సూర్యవర్ధిని పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కు తుందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌కె పంక్షన్‌హాల్‌లో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వ హించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ వాలం టీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా మూడవ ఏడాది అవార్డులుతో సత్కరిస్తోందన్నారు. వివక్ష, అవినీతికి తావులేకుండా వాలంటీర్లు పనిచేయాలని సూచించారు. గ్రామ, వార్డు వాలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వాలన్నారు. వైస్ ఎంపిపి మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి, ఎస్ కె ఖాదర్ మోహిద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషన్ రెడ్డి, సర్పంచ్ ఉమాపతి రెడ్డి, సర్పంచ్ కేశవ రెడ్డి కో - ఆప్షన్ సభ్యులు అరవీడు బాష, మాజీ వైస్ ఎంపిపి రమేష్ రెడ్డి సర్పంచ్, వాలంటీర్లు పాల్గన్నారు.

కోడిగుడ్డు వేసింది టిడిపి వారే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

టిడిపి జాతీ య ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్రలో ప్రొద్దుటూరులో వైసిపి వారు కోడిగుడ్డుతో దాడి చేశారని నానాయాగీ చేసిన సంఘటనలో కోడిగుడ్డు, ఆమ్లేట్ రెండూ టిడిపి వారివే అని విచారణలో తేలిందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడిగుడ్డు వేసిన బాబు, బావమరిది వినయ్ అని, వినయ్ మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ కుమారుని కారు డ్రైవర్ అన్నారు. ఈ నలుగురికి దగ్గరి సంబంధాలున్నాయని ఫొటో ప్రదర్శనతో వివరించారు. లోకేష్ పర్యటనలో ప్రొద్దుటూరులో ఎక్కడా సెల్ఫీకి అవకాశం దక్కకపోవడంతో అసహనానికి గురై కోడిగుడ్డు విసిరినట్లు విచారణలో తేలిందని, ఇదే విషయాన్ని స్థానిక డిఎస్‌పి విలేకరుల సమావేశంలో వెల్లడించారని గుర్తు చేశారు. ప్రజాసేవతో, సామర్థ్యంతో కాకుండా స్థానిక టిడిపి నాయకులు అబ ద్ధాలతో పదవులు పొందాలనుకుంటున్నారని విమర్శించారు. తనకొక న్యాయం, ఇతరులకో న్యాయంగా జీవించే మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో సిద్ధాంతరీత్యా వ్యతిరేకిస్తానన్నారు.

కోడిగుడ్డు వేసింది టిడిపి వారేనని పోస్టర్ చూపుతున్న ఎమ్మెల్యే

రైతుల చూపు.. సూక్ష్మ సేద్యం వైపు

అవార్డు దక్కించుకున్న ఇ.కొత్తపల్లె సర్పంచు బాలనాగ ప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆధునిక వ్యవసాయ రంగంలో బిందు, తుంపర వంటి సేద్యాలు రైతులను ఎంత గాలో ఆకట్టుకుంటున్నాయి. గతంలో సాగించిన బోరు మోటర్లకు స్వస్తి పలికి.. సూక్ష్మ సేద్యంతో రైతులు బిజీ అవుతున్నారు. నీటి ఆదా అవు తుందన్న కారణంగా వారు సూక్ష్మ సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. అన్ని రకాల భూము లకు ఈ సూక్ష్మ సేద్యం ఎంతో ఉపయోగ పడుతుందని పలువురు రైతులు అంటున్నారు. అలాగే ఏటవాలు భూములతోపాటు ఎర్ర రేగడి, నల్లరేగడి, గరుగునేలకు ఈ సేద్యాలు ఎంతో ఉపకరిస్తున్నాయని చెప్పవచ్చు. ఇందుకు ఉద్యానశాఖ రైతుల్లో ఉత్సాహం నింపడానికి 100 శాతం రాయితీపై సంబంధించిన పరికరాలను అందజేస్తోంది. ఈ సేద్యాలను ఉపయోగించి ఆశించిన లాభాలు సాధించడం ద్వారా ఇటీవల వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఇ.కొత్తపల్లి గ్రామ సర్పంచు బాల నాగప్రసాద్‌కు అవార్డు కూడా దక్కింది. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ పులివెందుల మండలం ఇ.కొత్తపల్లి గ్రామ పరిధిలో 562 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉందన్నారు. 461 హెక్టార్లు డ్రిప్పు, 101 హెక్టార్లల్లో తుంపర సేద్యం ఉందన్నారు. అంతా కలిసి మొత్తం 630 మంది రైతులకు బిందు, తుంపర సేద్యాల పరికరాలను అందిం చామన్నారు. ఈ పథకాల ద్వారా అరటి,

తుంపర సేద్యంతో సాగులో ఉన్న పంట

వేరుశనగ వంటి పంటలను ఇ.కొత్తపల్లి గ్రామ రైతులు సాగు చేస్తున్నారన్నారు. గతంలో వ్యవసాయ రంగంలో బావులను ఉపయోగించి వివిధ రకాల పంటలను సాగుచేసుకునేవారు. కాలగమనంలో తరచూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, కరువు కాటకాలు సంభవించడం వంటి కారణాల వల్ల భూగర్భ జలాలు అడుగం టిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసా యం సాగించడానికి గొట్టపు బోర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ గొట్టపు బోర్ల ఏర్పాటు చేసుకున్న అనంతరం వర్షాభావ పరిస్థితులు, కరువు కాటకాలు ఏర్పడడంతో రైతులకు సాగునీటి సమస్య తలెత్తింది. పులివెందుల ప్రాంతంలో వేలాది అడుగుల లోతు బోరు వేసినా నీరు కనిపించని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో అరటి, మామిడి, చీని, సన్ననిమ్మ, బొప్పాయి వంటి పంటలను రక్షించుకోవడానికి 1000 నుంచి 2000 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా ఫలితం దక్కలేదు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతులు సంపుల ద్వారా నీరు అందించేందుకు కొత్త ప్రయోగాలను చేపట్టారు. వీటి వల్ల కూడా వ్యయ ప్రయాసాలు ఎదుర్కొనక తప్పలేదు. వీటివల్ల లాభం లేదనుకున్న రైతులు బిందు, తుంపర సేద్యాలపై రైతులు దృష్టి పెట్టారు. ప్రభుత్వాలు కూడా ఇలాంటి వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి కనబరిచేందుకు వివిధ రాయితీలు ప్రకటించింది. దీంతో ఇ.కొత్తపల్లె రైతులు సూక్ష్మ సేద్యాన్ని పాటించి అవార్డు స్థాయికి వెళ్లారు.

మాట తప్పడం జగన్ దినచర్య

విలేకరులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దినచర్యగా మారిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఉద్యోగులకు మాట ఇచ్చి ఓట్లు పొంది, అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం జగన్ మాట తప్పారని మండిపడ్డారు. ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని పాదయాత్రలో మాట ఇచ్చి దాదాపు లక్ష మంది కాంట్రాక్టు ఉద్యోగులలో కేవలం 10,671 మందిని మాత్రమే రెగ్యులర్ చేసి మాట తప్పారన్నారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.12,500 ఇస్తానని మాట ఇచ్చి అందులో రూ.5000 కోత పెట్టి మాట తప్పడం శోచనీయమని చెప్పారు. యువత, మద్యపాన విషయంలో కూడా మాట మార్చారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, కరెంటు ఛార్జీలు, రాజధాని, పోలవరం విషయంలో వైసిపి ప్రభుత్వం మాట తప్పిందని వివరించారు. మాట తప్పిన నాయకుని ఓడించి ఇంటికి పంపాలని గతంలో జగనే చెప్పారని తులసిరెడ్డి గుర్తు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ చెప్పినట్లే ఆయనను, ఆయన పార్టీ నాయకులను ఓడించి ఇంటికి పంపించాల్సిన సమయం వచ్చిందని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు విశ్వనాథరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడులు అరికట్టాలని ఎండియు ఆపరేటర్ల నిరసన

మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వాహన ఆపరేటర్లు

ప్రజాశక్తి - చాపాడు

రేషన్ పంపిణీ సందర్భాల్లో రేషన్ వాహన అపరేటర్లను దుర్భాషలాడుతూ, భౌతికంగా దాడులు చేసే సంఘటనలు ఇటీవల పెరుగు తున్నాయని, వీటిని అరికట్టాలని మైదుకూరు మండల, మునిసిపాలిటీ రేషన్ వాహన ఆపరేటర్లు కోరారు. ఆ మేరకు వారు గురువారం మైదుకూరు మండలంలోని ముదిరెడ్డిపల్లె దళితవాడలో గత బుధవారం ఎండియు ఆపరేటర్‌పై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో నమోదు చేశారు. ఈ దాడి ఘటనలో నష్టపోయిన మంత్రేనాయక్‌కు సొమ్ము రికవరీ చేయించి, న్యాయం చేయాలని కోరారు. అలాగే భవిష్యత్‌లో రేషన్ వాహన ఎండియులపై దాడి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మైదుకూరు పాత ఎమ్మార్వో కార్యా లయం నుంచి ర్యాలీ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ వారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైదుకూరు మండల, మునిసి పాలిటీ పరిధిరేషన్ వాహన ఎండియు ఆపరేటర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పిల్లలు ఇష్టపడే గీతాంజలి ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చుట్టూ ఎత్తయిన చెట్లు, రంగురంగుల గోడలపై నవ్వు పుట్టించే బొమ్మలు, చదువు సంస్కారంతోపాటు ఆటపాటలకు సాంస్కృతిక కార్యక్రమాలకు అధిక ప్రాదాన్యతనిచ్చే 'గీతాంజలి ఉన్నత పాఠశాల' అంటే పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఎక్కువ ఇష్టం. ఆ పాఠశాల గురించి కరెస్పాండెంట్ ఎస్.శివరామిరెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. పిల్లలంటే ఇష్టపడే తనకు ఎక్కువ సమయం వారితోనే గడపాలనే కోరిక గీతాంజలి ఉన్నత పాఠశాల ప్రారంభానికి కారణమైందన్నారు. కేవలం 80 మంది పిల్లలతో 2005లో మొదలై గీతాంజలి పాఠశాల ప్రస్తుతం 800 మంది విద్యార్థులతో విరాజిల్లుతోందని తెలిపారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు క్లాసులున్నాయన్నారు. 6వ తరగతి నుండి 10వ

చిన్నపిల్లలకు స్లీపింగ్ బెడ్స్

తరగతి వరకు ఐఐటికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ 18ఏళ్లల్లో తమ పాఠశాలలో చదివిన విద్యార్థుల్లో 6 మంది మెడిసిన్ సీట్లు, 50మందికి పైగా ప్రైవేట్ ఉద్యోగాలు, 10 మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. భువన్‌రెడ్డి అను విద్యార్థి ఐఐటిలో అఖిల భారతస్థాయిలో రెండవ

చక్కటి వాతావరణంలో పాఠశాల



కంప్యూటర్ ల్యాబ్

ర్యాంకు సాధించి, ప్రస్తుతం ముంబైలో స్థిరపడినట్లు తెలిపారు. అధ్యయనం అనేది ఒక పనిలా కాకుండా ఆటపాటల్లో ఇది ఒకభాగం అనుకొని చదివితే సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నది తన అభిప్రాయంగా ఆయన తెలిపారు. అందుకే తమ విద్యార్థులు పాఠశాలలో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారన్నారు. ప్రతి శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మ్యాథ్స్‌డే, సైన్స్‌డే, గ్రాడ్యుయేషన్‌డే, వేస్ట్ మెటీరియల్ డే వాటితోపాటు ఏడాదికి మూడుసార్లు చిల్డ్రన్స్‌డే, స్కూల్‌డే, వసంత పంచమి నిర్వహిస్తామన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభం రోజు వెల్‌కమింగ్ డే నిర్వహిస్తామన్నారు. తామంతా ఒక్కటే అని తమలో పేద,ధనిక భావం లేదనే అలోచన వచ్చేందుకు తరచూ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఏకరూప దుస్తుల ధారణ (యూనిఫాం డే) రోజు నిర్వహిస్తామన్నారు. తమ పాఠశాలలో 40 కంప్యూటర్లతో ల్యాబ్, సైన్స్ ల్యాబ్ ఉందన్నారు. నర్సరీ పిల్లలకు తమ ఇంట్లో ఉన్నామనే భావన కలిగేందుకు మధ్యాహ్న భోజనం అనంతరం కాసేపు నిద్ర పోయేందుకు పరుపులు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇన్నర్ గార్డన్ నుంచి ప్రీ ప్రైమరీ, ప్రీ ప్రైమరీ నుండి ప్రైమరీ ఇలా తరగతి స్థాయి పెరిగే సమయంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పట్టా పుచ్చుకున్న అభిప్రాయాన్ని పిల్లలలో కలిగిస్తామన్నారు. తమ పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులను కూడా భాగస్వామ్య చేస్తామని ఆయన వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సూర్యకుమారి ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో గీతాంజలి పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోందని శివరామిరెడ్డి తెలిపారు.

కరస్పాండెంట్ శివరామిరెడ్డి

రమణయ్యను సన్మానిస్తున్న బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది

ఉద్యోగోన్నతి హర్షణీయం

జమ్మలమడుగు రూరల్ : ఎల్ఐసి కార్యాలయంలో ఎబిఎంగా పనిచేస్తున్న రమణయ్య బిఎంగా ఉద్యోగోన్నతి పొందడం హర్షణీయమని స్థానిక బ్రాంచ్ ఆఫీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, సిబ్బంది గురువారం సాయంత్రం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. జమ్మలమడుగు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ఎబిఎం రమణయ్య మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తూ సిబ్బంది, ఏజెంట్లకు ఎంతో సన్నిహితులుగా సేవలు అందించారని కొనియాడారు. పలువురు డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, ఉద్యోగులు మాట్లాడుతూ రమణయ్య తన విధి నిర్వహణలో చేసిన సహాయ సహకారాలను కొనియాడుతూ అభినం దించారు.

మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఉద్యోగాల కల్పనకు నిర్వహించే ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలని పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, పుర చైర్మన్ వల్లపు వరప్రసాద్ కోరారు. పులివెందుల మున్సిపాలిటీ కార్యాలయంలో గురు వారం మున్సిపల్ కమి షనర్ వివి నరసింహారెడ్డి అధ్యక్షతన ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌కు సంబంధించి మహిళ టైలర్స్ ఇంట ర్వ్యూలు జరిగాయి. ఇందు లో 200 మంది రాగా, 110 మందికి ఉద్యోగ అవకాశం వచ్చింది. అనంతరం వారు మాట్లా డుతూ గార్మెంట్స్‌లో పని చేసే వారికి ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం ఉంటుం దన్నారు. ప్రస్తుతం జనరల్ షిఫ్ట్ మాత్రమే అవకాశం ఉంది. కంపెనీ ప్రారంభించిన తర్వాత జీతం పెంచడం, చిన్న పిల్లల పెంపకానికి ఆయా సౌకర్యం కల్పిస్తామన్నారు. బస్సు సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో నీలకంఠరెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబెర్స్, మెప్మా గంగులయ్య, నాయుడు, నాగన్న, హరిత, రామాంజనేయులు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

చోరీలతో ప్రజల్లో భయాందోళనలు

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయ పంప్ సెట్ మోటర్ల తీగలు చోరీకి గురవుతున్న సంఘటనలు మండలంలో రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. దీంతో అన్నదాతలు కలత చెందుతున్నారు. వ్యవసాయం గిట్టుబాటుగాక అప్పులపాలవుతున్నారు. దీనికితోడు దొంగల బెడద అధికమైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రాత్రిపూట పోలీసులు గస్తీ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు అధికవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అరికట్టాల్సిన పోలీసులు నిద్రావస్థలో ఉండడం ఏమిటని రైతులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించు కోకపోవడం, వారిపైన చర్యలు తీసుకోకపోవడం సరికాదని ప్రజలు పేర్కొం టున్నారు. దొంగతనాలు జరగకుండా అరికట్టాల్సిన పోలీసులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతోనే చోరీ ఘటనలు అధికమవుతున్నాయని చర్చిం చుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నత అధికారులు స్పందించి రాత్రిపూట గస్తీని ముమ్మరం చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నేడు గర్భిణులకు పరీక్షలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణీలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక వైద్యులతోపాటు ప్రొద్దుటూరు నుంచి గైనకాలజిస్ట్ పరీక్షలు నిర్వహిస్తారని తెలి పారు. గర్భిణీలకు ఖాదర్‌పల్లె సర్పంచు జైనుల్లా దంపతులు భోజన వసతి కల్పి స్తారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ఆశాలు, ఎఎన్ఎంలు గర్భి ణులకు అవగాహన కల్పించి, వారు పరీక్షలకు వచ్చేలా చూడాలని కోరారు.

విత్తనాలను అందిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని ఎర్రబెల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం వేరుశనగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి నాగలక్ష్మి పంపణీ చేశారు. మండలానికి 100 వచ్చాయని ఎఒ తెలిపారు. కార్యక్రమంలో ఎర్రి పల్లి సర్పంచు లింగాల మహేశ్వర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ కంచర్ల వెంకట సర్వోత్తమరెడ్డి, వ్యవ సాయశాఖ ఎడి వెంకటేష్, ఎఇఇ హంశిల్ప, ఎపిఎం రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం చదివేది అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ తెలిపారు. గురువారం గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం విద్యార్థు లకు ఆయన పంచతంత్ర కథలు చెప్పారు. విద్యార్థు లకు కేక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైదాపురం పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జివి సత్రం-నాగసానిపల్లి మార్గంలో రక్షణలేని కల్వర్టు

రక్షణ గోడల్లేక పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పలు మార్గాల్లో నిర్మించిన కల్వర్టులు, వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వాటికి రక్షణగోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమా దాలకు గురవుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. పత్తూరు సమీపంలో కడపకు వెళ్లే ప్రధాన మార్గం వాగుపై నిర్మించిన వంతేనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన రక్షణ కూడా పూర్తిగా దెబ్బతింది. శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడ అంతా పూర్తిగా పడిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనకి ఇరువైపులా రక్షణ కూడా దెబ్బతింది. దీంతో అదుపుతప్పి వాహనాలు కాలువలో పడే ప్రమాదం ఉందని హడలి పోతున్నారు. నాగసానిపల్లె నుంచి గుడ్డి వీరయ్య సత్రం వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన కల్వర్టుకు ఇరువైపులా రక్షణ కూడా లేదు. వర్షాకాలంలో కల్వర్టుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో పలుచోట్ల కల్వర్టులు, వంతెనలకు ఇరువైపులా దెబ్బతిన్న రక్షణ గోడలను గుర్తించి, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఎంపిపిగా జల్లా ప్రభావతమ్మ ఏకగ్రీవం

గాలివీడు : మూడవ ఎంపిపి అభ్యర్థి జల్లా ప్రభావతమ్మను ప్రాదేశిక సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడూతూ ప్రజాప్రతినిధులు ఒకరినొకరు సహకరిం చుకుంటూ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లి యదు భూషణరెడ్డి, లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ఆవుల నాగభూషణ్‌రెడ్డి, వైసిపి మైనర్టీ నాయకులు ఎస్.కె.ఖాదర్‌మోదీ, ఎంపిడిఒ శేఖర్‌నాయక్, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.